క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోకవరం: మండలంలోని గోకవరం–కొత్తపల్లి ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గంగవరం మండలం ట్యాంకు బీడుకు చెందిన కరణం గోవిందు (29) బుధవారం రాత్రి బైక్‌పై పోలవరం వెళుతున్నాడు. ఈ క్రమంలో కొత్తపల్లి శివారున బైక్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టుని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన గోవిందు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై ఎంవీఆర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ పర్వత రాజబాబు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రాజబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. రైతులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఈగల చిన్నమ్ములు, ధారా వెంకట రమణ, ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పరిశీలన



ఏలేశ్వరంలో ఇళ్లస్థలాల వివరాలు తెలుసుకుంటున్న జేసీ ఇలక్కియ

ఏలేశ్వరం: పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను బుధవారం జాయింట్ కలెక్టర్ ఇలక్కియ పరిశీలించారు. స్థానిక కోరాడనగర్ సమీపంలోని ఇళ్ల స్థలాలను పరిశీలించి లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ విశ్వనాథశాస్త్రి, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, వీఆర్వో అవసరాల కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, పైల శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లాల్‌బహుదూర్ శాస్త్రి వర్ధంతి



ఏలేశ్వరంలో లాల్‌బహుదూర్‌శాస్త్రి విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సత్యవతి

ఏలేశ్వరం: భారత మాజీ ప్రధానమంత్రి లాల్‌బహుదూర్‌శాస్త్రి వర్ధంతిని పట్టణంలో బుధవారం నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలోని శాస్త్రి విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానమంత్రిని లాల్‌బహుదూర్‌శాస్త్రి చేసిన సేవలను కొనియాడారు. యువత లాల్‌బహుదూర్‌శాస్త్రిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ దుర్గా వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కిర్లంపూడి: మండల పరిధిలోని రామచంద్రపురం, సోమరాయనపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఉపాధి పనులు పారదర్శకంగా చేయాలని ఏపీఓ బి.చిరంజీవిరావును ఆదేశించారు. ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అల.. సామాజిక సేవలో..

- స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడుస్తున్న యువత
- మహనీయుని స్ఫూర్తితో పదేళ్లుగా సేవాకార్యక్రమాలు
- ముగ్గురితో మొదలై 45కు పెరిగిన సభ్యులు
- నేడు జాతీయ యువజన దినోత్సవం



కోవిడ్ సమయంలో నిత్యావసరాలు అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు



రక్తదానం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు



పేదలకు ఆహారం అందిస్తున్న దృశ్యం

తొండంగి: దేశానికి యువతే అత్యంత ముఖ్యమైన శక్తి అని ప్రపంచానికి చాటిచెప్పిన స్వామీ వివేకానందుని స్ఫూర్తితో యువత సేవా కార్యక్రమాల్లో దూసుకుపోతున్నారు. కోన ప్రాంతం మారుమూల గ్రామంలో పదేళ్ల క్రితం ముగ్గురు స్నేహితులు కలిసి చేసిన ఆలోచన నేడు హెల్పింగ్ హ్యాండ్స్ రూపంలో ఆపదలో ఉన్న వారికి వేలాది మందికి ఆపన్న హస్తం అందిస్తోంది. దానవాయిపేటకు చెందిన చొక్కా స్వామి, గరికిన డానియేలు, అనసూరి లోవప్రసాద్ ముగ్గురు స్నేహితులు. కష్టంలో ఉన్నవారికి తోచిన సహాయం చేయాలన్న ఆలోచన స్వామికి రావడంతో మిగిలిన ఇద్దరికి చెప్పాడు. దాంతో ముగ్గురు గ్రూపుగా ఏర్పడ్డారు. మొదట పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం వంటివి చేసేవారు. వీరిని స్ఫూర్తిగా తీసుకున్న మరికొంత మంది యువత వీరికి తోడయ్యారు. దీంతో 12 మంది కలిసి 2014లో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేశారు.

జోరుగా సేవా కార్యక్రమాలు

ప్రస్తుతం 45 మంది సభ్యులున్న సంస్థ ద్వారా సభ్యులతో పాటు బయటి నుంచి ఎంతో మంది దాతలు కూడా వీరికి తోడ్పాటును అందించడంతో కొంత ఆర్థిక సహాయం పోగు చేసి వికలాంగులు, వృద్ధులు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అగ్నిప్రమాదాల వల్ల ఇళ్లు కాలిపోయిన బాధితులకు నిత్యావసర వస్తువులను అందించడం, ప్రమాదాల్లోనూ, క్యాన్సర్, ఇతర ప్రాణాంతక రోగాలతో అనారోగ్యంగా ఉన్న రోగులకు రక్తదానం చేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో గ్రామాల్లో ఇళ్లకు ఫుడ్ డెలివరీ, వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం అందించడం వంటి కార్యక్రమాలు ఎన్నో నిర్వహించి నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ముగ్గురు స్నేహితుల్లో స్వామి హోటల్ మేజన్‌మెంట్ పూర్తి చేసి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. డానియేలు పాస్టర్‌గానూ, అనసూరి లోవప్రసాద్ ఎంబీయే పూర్తి చేసి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తమ కుటుంబాలను పోషించుకుంటూనే తోటి వారి కష్టాన్ని తెలుసుకుని ఆపన్న హస్తం అందించే హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు ఎంతో మంది దాతలు తోడై ముందుకు నడిపిస్తున్నారు.

> **దాతల సహకారంతోనే..**
>
> 
>
> మా స్నేహితులం ముగ్గురం కలిసి అనుకున్న ఆలోచనకు మా సంస్థ సభ్యులతో పాటు దాతలు అండగా నిలిచారు. వారందరి సహకారంతోనే కష్టంలో ఉన్నవారికి సహాయం చేయగలుగుతున్నాం. తోటి మనిషి కష్టం, ఆపద చూసి స్పందించే మనసు అందరికీ ఉండాలి. ఎదుట వ్యక్తి కష్ట సమయంలో ఉంటే ఆదుకోవడాన్ని ప్రతి మనిషి బాధ్యతగా భావించాలి.
>
> – చొక్కా స్వామి, హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ నిర్వాహకుడు, దానవాయిపేట

సత్యదేవునికి జన్మనక్షత్ర పూజలు



సత్యదేవునికి ఆయుష్యహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా బుధవారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పండితులు తెల్లవారుజామున ఒంటి గంటకు సత్యదేవుని ఆలయం తెరిచి పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు పాలు, తేనె, నెయ్యి, పెరుగు, పండ్ల రసాలతో మహాన్యాశపూర్వక అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు.

ఘనంగా ఆయుష్యహోమం

స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి యాగశాలలో ఆయుష్యహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు హోమం ప్రారంభించి 11 గంటలకు ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి నీరాజనమంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

అన్నవరం: సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ ఎస్. కుమార్ రాజా బుధవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. సిబ్బందికి జీతాలు పెంచామని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలతో పాటు ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శంఖవరం వైస్. ఎంపీపీ ధారా వేంకటరమణ, ఎంపీటీసీలు దడాల సతీష్, కొండి లక్ష్మి, వైస్ సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'మన మున్సిపాలిటీ'

తుని: పట్టణంలోని ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే మన మున్సిపాలిటీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక 24 వార్డులో అధికారులు, కౌన్సిలర్లతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పురపాలకసంఘం ద్వారా చేయాల్సిన పనులను త్వరలోనే చేపడతామన్నారు. కాలువలు, రోడ్లు, విద్యుత్ దీపాలు, కుళాయిలు తదితర సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకువెళతామని బాలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వార్డు కౌన్సిలర్ పులి సత్యనారాయణ, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఇన్‌చార్జి డీఈఈ ప్రకాశరావు, ఏఈ అఖిలాష్, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం గ్రామ శివారున నిర్వహిస్తున్న కోడిపందేలపై బుధవారం గోకవరం పోలీసులు దాడి చేశారు. కృష్ణునిపాలెంలో కోడి పందేలు ఆడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఎస్సై యువి శివనాగబాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.3650 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- అట్టహాసంగా కాకినాడ జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



మంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘ నూతన కార్యవర్గం

తుని రూరల్: ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరం శివారు సాయివేదికలో కాకినాడ జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగింది. మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు ఫొటోగ్రాఫర్లు సృజనాత్మకత జోడించి సజీవమైన ఫొటోలను ఆవిష్కరించాలన్నారు. కాకినాడ జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని ఆ సంఘ నూతన అధ్యక్షుడు చేసిన విజ్ఞప్తిపై మంత్రి దాడిశెట్టి రాజా స్పందించారు. ఎంపీ వంగా గీతా, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ అంశాన్ని చర్చించి స్థల, భవన నిర్మాణానికి నిధులు కేటాయింపుపై చర్యలు తీసుకుంటానని మంత్రి రాజా హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, రాష్ట్ర కార్యవర్గం (ఏపీపీవీడబ్ల్యూఏ) చైర్మన్ ఆర్‌వీ అప్పారావు, వైస్ చైర్మన్ చక్కా రాంబాబు, ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, తుని జోన్ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

కాకినాడ జిల్లా నూతన కార్యవర్గం

సంఘ గౌరవాధ్యక్షుడిగా ఎండీ ముక్తార్, గౌరవ సలహాదారుడిగా కొత్త సత్యదత్తు, అధ్యక్షుడిగా బచ్చు వీరవెంకట సత్యనారాయణ (చిన్ని), ప్రధాన కార్యదర్శిగా బెక్కం శ్రీను, కోశాధికారిగా తేలుగుంట శివకుమార్, ఉపాధ్యక్షులుగా పప్పు విజయ్, కర్రి సత్తిబాబు, సహాయ కార్యదర్శులుగా డోకుల అనంత శ్రీనివాసరెడ్డి, బత్తిన సూర్యనారాయణ, పీఆర్‌ఓ షేక్ సలీమ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వీసం రాజేష్, జి.మురళి, వై.బుజ్జి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- రాచపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం



రాచపల్లిలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని రాచపల్లిలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను (బంకు శ్రీను) పార్టీ నాయకులు సారిపల్లి గంగరాజు, ఒమ్మి వెంకటరమణ, పెద్దిరెడ్డి ప్రసాద్, పెద్దిరెడ్డి నానిబాబు తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడున్నరేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్వీ చలం, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు, పార్టీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, సర్పంచులు రొంగల నాగేశ్వరరావు, నడిగట్ల త్రిమూర్తులు, ఎంపీటీసీలు మేడసాని సింహాద్రి, అమరాది కాశీ, తటవర్తి రామన్న దొర, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



జీవామృతం తయారీపై విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి రామకృష్ణాగార్డెన్స్‌లో డాక్టర్ వైఎస్సార్ యూనివర్శిటీ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం శిక్షణ ఇచ్చారు. విద్యార్థినులు టి.యోగ్యత, జి.పూజిత, ఎం.ఇషిత, బి.తేజస్విని తదితరులకు ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి ఆధ్వర్యంలో జీవామృతం తయారీ, పంటల సంరక్షణ, మొక్కల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలో సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు గోకవరం ఎస్సై యువి శివనాగబాబు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. దేవీపట్నం మండలం చినభీంపల్లికి చెందిన పాట్నూరి అజయ్, కారం పండుదొర రంపచోడవరం మండలం ఫోక్స్‌పేట నుంచి బైక్‌పై సారా తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడిలో వారి నుంచి 100 లీటర్ల సారా, బైక్, అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపరిచారు.

జగనన్న పాల వెల్లువపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ్‌కుమార్

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న పాల వెల్లువ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జగనన్న పాల వెల్లువపై సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామసచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు సరైన గిట్టుబాటు ధర లేక పశుపోషణను క్రమంగా వదిలేసే పరిస్థితి ఉందన్నారు. పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీడీఓ పసుపులేటి సతీష్, ఈవోపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళ్లిపూడి అంజి, పంచాయతీ కార్యదర్శులు వాడ్రేవు చక్రవర్తి, రాజబాబు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



గండేపల్లి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న అభివృద్ధి కమిటీ చైర్మన్ దొరబాబు

గండేపల్లి: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని స్థానిక పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ చలగళ్ల దొరబాబు సూచించారు. స్థానిక పీహెచ్‌సీని బుధవారం ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బీవీజీఎస్ రామాచార్యాలు, గ్రామ సర్పంచ్ రూతుల రాణి, ఉప సర్పంచ్ మద్దిపట్ల రామకృష్ణ, వైద్యాధికారి ఐ.సౌమ్య, సూపర్‌వైజర్ ఎ.చెల్లారావు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఏర్పాటు

తుని రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం కొనుగోలు తదితర సమస్యలు పరిష్కరించుటకు ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 1967ను ఏర్పాటు చేసినట్టు మండల పౌరసరఫరాల అధికారి కె.పుణ్యవతి బుధవారం తెలిపారు. రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ప్రభుత్వం 1967 నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. 1800 425 0082, 1967 (పౌరసరఫరాల శాఖ), 1800 425 3157, 14445 (ఒకే దేశం ఒకే రేషన్‌కార్డు), 1800 425 2388, 155325 (రాష్ట్ర ఆహార కమీషన్), 1800 425 4202 తూనికలు కొలతల శాఖల టోల్‌ఫ్రీ నంబర్లను అనుసంధానం చేస్తూ ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ 1967ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఆమె వివరించారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం కొనుగోలు, గ్యాస్ సిలెండర్, పెంట్రోల్ బంకులు, తూనికలు కొలతలు, బియ్యం కార్డు సేవలు, తదితర సమస్యలపై 1967 నంబరులో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సంక్రాంతి పండగను ప్రశాంతంగా జరుపుకోండి

తుని: ప్రజలు సంక్రాంతి పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోటనందూరు ఎస్సై పి.స్వామి నాయుడు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు కోడి పందాలు, గుండాట, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాల వైపు వెళ్లవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

తొండంగి: మండలంలోని శృంగవృక్షంలో అగ్ని ప్రమాద బాధితులకు జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన అడ్డాల మరిడియ్య, ద్రాక్షారపు నూకరాజు ఇళ్లు మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. దీంతో ఆ కుటుంబాలకు జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత రూ.6 వేలు, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు పీవీవీ రమణ మూర్తి(వెంకట్) రూ.5 వేలు, పార్టీ సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్ అడపా సురేష్ రూ.2500 వెరసి మొత్తం రూ.13500 బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

మిస్టర్ జేఎన్‌టీయుకేగా రాంప్రసాద్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి పీజీఎస్ రాంప్రసాద్ జేఎన్‌టీయూకేలో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చూపి మిస్టర్ జేఎన్‌టీయూకేగా నిలిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ బి.సంజయ్, డీన్ ఎ.రామకృష్ణ తెలిపారు. రాంప్రసాద్ 60 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, చాంపియన్‌షిప్ ఆఫ్ చాంపియన్స్‌లో సిల్వర్ మెడల్ సాధించినట్టు వివరించారు. విద్యార్థి రాంప్రసాద్‌ను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాల్, తదితరులు అభినందించారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

తుని/ఏలేశ్వరం/జగ్గంపేట/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/గండేపల్లి/కిర్లంపూడి/గోకవరం: పండిన పంటలు, కొత్త అల్లుళ్లు, బంధు మిత్రులు, స్నేహితులు అందరు ఒకే చోట కలిసి జరుపుకునే ఏకైక పండుగ సంక్రాంతి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సంక్రాంతి రావడానికి కొద్ది రోజుల సమయం ఉన్నా విద్యార్థులకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో పాఠశాలల్లో ముందస్తు వేడుకలు జరిపారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గంగిరెద్దులు, హరిదాసులు, గాలిపటాలు, భోగిమంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.



తునిలో గాలిపటాలను ఎగుర వేస్తున్న విద్యార్థులు



ఏలేశ్వరంలో సంక్రాంతి సంబరాలు



ప్రత్తిపాడు మినర్వా స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



జగ్గంపేట వివేకానంద స్కూల్లో భోగిమంట వద్ద విద్యార్థుల సందడి



జగ్గంపేట డిగ్రీ కళాశాలలో భోగి మంట వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రనాయుడు